# తాండూరులో కమలం జోరు..!

**- రాజాసింగ్ పర్యటనతో పెరిగిన ఉత్సాహం**

**- కొండా గెలుపు పక్కా అంటున్న నేతలు**



**తాండూరు, మే 7, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో కమలం జోరందుకుంది. గత రెండు రోజుల క్రితం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పర్యటనతో పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు పక్కా అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో భారతీయ జనతాపార్టీ నేతల ప్రచారం జోరుగా కొనసాగుతుంది. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో బిజెపి గాలీ విస్తుంది. తాండూరు నియోజకవర్గంలో కూడా ఎక్కువ శాతం యువతతో పాటు ప్రజలు తామంతా బిజెపి వెంటే ఉంటాం అంటూ బహిరంగంగానే చెప్పక చెప్తున్నారు. దేశ ప్రజలంతా మరోసారి కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్నే బలరుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలలో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్‌కుమార్‌తో పాటు మండలాల నాయకులు, కార్యకర్తలు విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం తాండూరులో హైదరాబాద్ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పర్యటించారు. పట్టణంలో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి కొండాతో కలిసి పెద్ద ఎత్తున బైక్‌ర్యాలీతో రోడ్‌షో నిర్వహించారు. రాజాసింగ్ పాల్గొన్న రోడ్ షోలో సుమారు 10వేల మంది వరకు యువకులు, నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. రాజాసింగ్ పర్యటన సక్సెస్ కావడంతో పార్టీ నేతలు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరిగింది. ప్రజల్లో కూడా బిజెపిపై నమ్మకం ఏర్పడింది. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా గెలుపు పక్కా అని, కేంద్రంలో కూడా బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని, మూడోసారి ప్రధాని నరేంద్ర మోడీ ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# రైతు బాంధవుడు సిఎం రేవంత్ రెడ్డి

**-రైతు ఖాతాల్లోకి రూ.2వేల కోట్లు నిధులు విడుదల చేసిన సిఎం**

**-సిఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన రైతు అవార్డు గ్రహీత జిల్లెల బాల్ రెడ్డి**

**నందిగామ మే 7, ప్రభాతవార్త :**
ఆరు గాలం రెక్కలు ముక్కలు చేసుకొని, అందరికీ అన్నం పంచే రైతు, ఎద్దు యవసం బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మి రైతుబంధు ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రూ.2 వేల కోట్లు నిధులు విడుదల చేసిన సిఎం రేవంత్ రెడ్డికి మంగళవారం నందిగామ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జిల్లెల్ల బాల్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలకు పరిహారం కింద నేరుగా రైతు ఖాతాలోకి జమ చేశారని సిఎం రేవంత్ రెడ్డిని రైతులు, ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని నమ్మిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని కితాబిచ్చారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలి





**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :**
పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ,రిటర్నింగ్ అధికారి శశాంక్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్, ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి రిటర్నింగ్ అధికారి శశాంక్ పరిశీలించారు. ముందుగా తాండూరు పట్టణంలోని సాయిపూర్ నెంబర్-2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను రిటర్నింగ్ అధికారి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ..పార్లమెంటరీ ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయని వారికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని అధికారులు సూచించారు. అనంతరం సెంట్ మార్క్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించి ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చేవెళ్ల పార్లమెంటరీ రిటర్నింగ్ అధికారి పర్యటనలో తాండూరు నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస రావు, తహసీల్దార్‌లు తారా సింగ్, కిషన్ నాయక్, మునిరుద్దిన్, వెంకటేశంలతో పాటు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి లోకసభ స్థానంలో 37లక్షల 79వేల 596మంది ఓటర్లు

## - దేశంలోనే మల్కాజ్‌గిరిలో అత్యధిక ఓటర్లు




మల్కాజ్‌గిరి ఎంపి పరిధి ముఖ చిత్రం దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 7, ప్రభాతవార్త**
మల్కాజ్‌గిరి లోకసభ (పార్లమెంట్) స్థానంలో 37లక్షల 79వేల 596మంది ఓటర్లు ఉన్నారు. దేశంలోనే అత్యధికంగ ఓటర్లు మల్కాజ్‌గిరి లోకసభ స్థానంలోనే ఉండటం విశేషంగ చెప్పవచ్చు. మల్కాజ్‌గిరి ఎంపి పరిధిలో ఎక్కువగా పట్టణ ప్రాంతంగ, తక్కువగా గ్రామీణ ప్రాంతంగ ఉంది. ఓటర్లు కూడ దేశంలోనూ, తెలంగాణలోనూ మల్కాజ్‌గిరి స్థానం ఓటర్ల సంఖ్యలో అతి పెద్దదిగా మారింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్కాజ్‌గిరి ఎంపి ఎన్నికల నిర్వాహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తుంది. ఈ నెల 13వ తేదీన మల్కాజ్‌గిరి ఎంపి పదవికి ఎన్నికలు జరుగుతున్నందున పోటీలో 22మంది అభ్యర్థులు ఉన్నారు. వీరిలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ముమ్మరంగ తమ ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నాయి. ఓటర్లను పోటీ చేస్తున్న అభ్యర్థులు కలిసి గెలిపించాలని కోరుతున్నారు. మిగతా అభ్యర్థులు కూడ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అయితే మల్కాజ్‌గిరి పార్లమెంట్ (లోకసభ) స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో మేడ్చల్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్, ఎల్‌బినగర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు 6లక్షల 65వేల 979మంది ఓటర్లు ఉన్నారు, మల్కాజ్‌గిరిలో 5లక్షల 08వేల 048మంది ఓటర్లు ఉన్నారు. కుత్బుల్లాపూర్‌లో 7లక్షల 24వేల 992మంది ఓటర్లు ఉన్నారు. కూకట్‌పల్లిలో 4లక్షల 82వేల 056మంది ఓటర్లు ఉన్నారు. ఉప్పల్‌లో 5లక్షల 40వేల, 052మంది ఓటర్లు ఉన్నారు. కంటోన్మెంట్‌లో 2లక్షల 53వేల 706మంది ఓటర్లు ఉన్నారు. ఎల్‌బినగర్‌లో 6లక్షల 04వేల 763మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పురుషులు 19లక్షల 45వేల 624మంది ఓటర్లు పురుషులు ఉన్నారు. మహిళలు 18లక్షల 33వేల 430మంది ఓటర్లు ఉన్నారు. దీనిలో టిజిలు 542మంది ఉన్నారు. ఇక మల్కాజ్‌గిరి ఎంపి పరిధిలో మొత్తం ఓటర్లు 37లక్షల 79వేల 596మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎంపి పరిధిలో సుమారు 3,190వరకు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వాహణకు అధికాక యంత్రాంగం పూరినత స్థాయిలో ఏర్పాట్లు సిద్ధం చేస్తుంది. ఈ నెల 13వ తేదీన జరుగనున్న మల్కాజ్‌గిరి ఎంపి ఎన్నికల్లో తమ ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకోనున్నారు. ఈ సారి సంబంధిత అధికారులు కూడ ఓటింగ్ శాతం ఎక్కువగా జరగటానికి ప్రచారాన్ని కూడ నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మల్కాజ్‌గిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ సూచించటం జరిగింది.

# జోరందుకున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారం

**యాచారం మే7, ప్రభాతవార్త :**
ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ప్రధాన పార్టీల ప్రచారం జోరుగా ఊపుందుకుందని చెప్పవచ్చు. ముగిసిన కార్నర్ మీటింగులు కొనసాగుతున్న ఇంటింటా ప్రచారం. సోషల్ మీడియాలో సామాజిక మధ్యల ద్వారా ప్రధాన పార్టీ కార్యకర్తలు నాయకులు అభ్యర్థుల వ్యాపారం వ్యక్తిగత విషయాలతో దుమ్మెత్తి పోసుకుంటున్నారు. రియల్ వ్యాపారం చేసే నాయకులను పార్లమెంట్ ప్రధాన పార్టీల అభ్యర్థులకు రియల్ వ్యాపారంతో ముడిపెడుతూ ఆరోపణలు తప్పడం లేదు. ఎంత నిజాయితీగా ఉన్న రాజకీయంలో దుమ్మెత్తి పోసుకోవడం వ్యక్తిగత దూషణలు చేసుకోవడం కార్యకర్తలతోనే మొదలవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీల నాయకులు కార్యకర్తలు సమన్వయంతో వ్యక్తిగత దూషణలు చేయకుండా నడుచుకోవాలని ఎన్నికల అధికారులు ఎంత చెప్పిన వినిపించుకోవడం లేదని తెలుస్తుంది. ఎన్నికల సమయంలో కేసు నమోదు అయితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్న సంగతి తెలియాల్సి ఉంది. ఎన్నికల నియమావళి చట్టాలు తీవ్రంగా ఉంటాయని ప్రజలకు తెలుసుకోవాలని పలువురు భావిస్తున్నారు.

# ప్రజల గుండెల్లో మోడీ : కొండా సంగీతారెడ్డి



వికారాబాద్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

**వికారాబాద్, మే 07, ప్రభాతవార్త :**
దేశ ప్రజల గుండెల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ స్థిరస్థాయిగా నిలిచిపోయారని చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి కొండా సంగీత రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓల్డ్ గంజ్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్ల ను చిరునవ్వుతో పలకరిస్తూ ముందుకు సాగారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పట్టణ ప్రజలకు వివరించారు. దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకుపోతున్న నరేంద్ర మోడీని మూడవ సారి ప్రధాన మంత్రి చేయాలని పిలుపునిచ్చారు. అటు నరేంద్ర మోడీ ఇటు కొండా విశ్వేశ్వర్ రెడ్డి లాంటి అవినీతి ఆరోపణలు లేకుండా క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకులు ఎన్నుకోవాలని ఆమె కోరారు. ఇలాంటి వారే నిస్వార్థంతో ప్రజాసేవ చే స్తారని ఆమె తెలిపారు. మే 13వ తేదీన ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తరలి వచ్చి పోలింగ్లో పాల్గొ నాలని ఆమె కోరారు. మీ అమూల్యమైన ఓటున ు కమలం పువ్వు గుర్తుపై వేసి రెండు లక్షల ఓట్ల భారీ మెజార్టీతో కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని సంగీతారెడ్డి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌లో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

## -సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

**కొడంగల్, మే 7ప్రభాతవార్త**
పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. మద్దూర్ మండలం బీఆర్ఎస్ అధికార ప్రతినిధి దిడ్డి వెంకటేష్‌యాదవ్‌తో పాటు పలువురు మాజీ సర ్పంచ్‌లు, నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అలాగే కొడంగల్ మండల మాజీ వైస్ ఎంపీపీ నర్సిములు, రుద్రారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు హస్తం గూటికి చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల వరకు కొడంగల్ నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్నా అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి ఓటమి చెందడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిత్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి కొనసాగుతుండడంతో గులాబీ పార్టీ నుంచి ఒక్కొక్కరుగా హస్తం గూటికి చేరుతున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ద్వితీయశ్రేణీ నాయకత్వం నాయకులందరూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో కొడంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఉనికే ప్రమాదం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. కొడంగల్ నియోజకవర్గంలోని దౌలా_బాద్ మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని మండలం లో తన కనుసన్నల్లో శాసించిన నాయకుడు ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీకి భారీ నష్టం వాటిల్లే ప్రమాద ముంది. అంతేగాక దౌల్తాబాద్ మండలంలో పట్టున్న నాయకుడు ప్రమోద్‌రావుతో పాటు పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు మూకుమ్మడిగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేర డంతో బీఆర్ఎస్ నాయకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అంతేగాక కోస్గి మండలంలో బీఆర్ఎస్ జడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చేర్మెన్ మేకల లతతో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్‌లు హస్తం గూటికి చేరుకోవడంతో బీఆర్ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల గడవు సమీపి స్తున్న తరుణంలో ఓపక్క బీఆర్ఎస్ నుంచి నాయకులు మూకుమ్మడి గా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నా కనీసం వారి నిలువరించేందుకు కూడా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రయత్నించక పోవడం శోచనీయమని బీఆర్ఎస్ పార్టీ నాయకులే బాహటంగా పెదవి విరుస్తున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

# బిఆర్ఎస్‌పార్టీకి రాజీనామా..కాంగ్రెస్‌పార్టీలో చేరిక

**-అధికారపార్టీలోకి దళిత సంఘాల నేతలు..వంద మంది యువకులు**

**ఘట్‌కేసర్, మే 7, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు వంద యువకులు ఆపార్టీకి రాజీనామా చేసి అధికార కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో వారు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి టీపీసీసీ ఉపాధ్యక్షులు-మేడ్చల్ ఇంచార్జ తోటకూర వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల మల్లేశ్, ఘట్‌కేసర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసుతో పాటు బాలాజీ నగర్‌కు చెందిన వృద్దులు, మహిళలు, వంద మంది బీఆర్ఎస్ కార్యకర్తలు గులాబి పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ వారికి కాంగ్రెస్ కండువాలు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ మరింత బలోపేతం అవుతుందని, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని వజ్రేశ్‌యాదవ్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యాయాదవ్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మాజీ సర్పంచులు అబ్బసాని యాదగిరియాదవ్, మెడబోయిన వెంకటేశ్, కౌన్సిలర్లు కడుపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిల్కూరి మచ్చేంధర్‌రెడ్డి, బొక్క సుధాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, బర్ల దేవేందర్, బొక్క జంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు నార్ల మల్లేశ్‌యాదవ్, ఎం.అబ్దుల్‌ఖయ్యూమ్, మోత్కుపల్లి శ్రీనివాస్, చిలుగూరి రవి, అశ్రఫ్, ఫయిమ్, సందీప్, పవన్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.



టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న మీసాల మల్లేశ్, మేకల దాసు తదితరులు

# క్వారీ గుంతలో పడి బిటెక్ విద్యార్థి గల్లంతు



క్వారీ గుంతలో పడి నీటమునిగిన విద్యార్థి కొరకు గాలింపు చర్యలు చేపట్టిన ఎన్టీఆర్ఎఫ్ సిబ్బంది బృందం.

**ఘట్‌కేసర్ రూరల్, మే 7, ప్రభాతవార్త:**
క్వారీ గుంతలో పడి బీటెక్ విద్యార్థి గల్లంతు అయిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు పోచారం ఐటీసీ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని ఏలూరుకు చెందిన యశ్వంత్ ( 19 ) కొర్రెముల పరిధిలోని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతూ నారపల్లిలోని హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. యశ్వంత్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి అన్నోజిగూడలోని ఔటర్ టోల్‌ప్లాజా వద్ద క్వారీ గుంతలోకి సెల్ఫీ ఫోటోల కొరకు దిగారు. ఫోటోలు దిగుతూ యశ్వంత్ క్వారీ గుంతలో నీట మునిగినట్లు పోలీసులు తెలిపారు. తోటి స్నేహితులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రంగప్రవేశం చేసి నీట మునిగిన విద్యార్థి కొరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఏన్టీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి నీట మునిగిన విద్యార్థి కొరకు గాలింపు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీసీ పోలీసులు తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం..విద్యుత్ సరఫరాకు అంతరాయం

## -పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు..వేసవి నుంచి ఉపశమనం



ఘట్‌కేసర్‌లో భారీవర్షానికి డ్రైనేజీ పొంగుతున్న దృశ్యం

**ఘట్‌కేసర్, మే 7, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తీవ్రమైన ఎండలు, ఉక్కపోత, వడగాలులతో అల్లాడిపోతున్న జనాలకు వర్షంతో ఉపశమనం కలిగింది. ఇటీవల ఎండలు మండిపోగా ఉపరితల ద్రోణి ప్రభావంతో సాయంత్రం 5 గంటల నుంచి ఈదురుగాలులు వీచి ఒక్క సారిగా నల్లని మేఘాలు కల్ముకొని వాతావరణం మారిపోయి వర్షం కురిసింది. భారీ వర్షంతో ఎండల వేడిమి నుంచి ప్రజలు ఊరట చెందగా తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘట్‌కేసర్, కొండాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, ఘణాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, మాదారం, పోతరాజుగూడెం, జోడిమెట్ల, చౌదరిగూడ, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తూ వర్షం కురుస్తుండటంతో ఉష్ణోగ్రత తగ్గే అవకాశం ఉంది. ఘట్‌కేసర్ పట్టణంలో టీచర్స్ కాలనీ, ధర్మశాల రోడ్డులో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ పనులు జరుగుతుండగా వర్షానికి డ్రైనేజీ పొంగిపొర్లుతూ బురదమయంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్‌లోని పలు కాలనీల్లో రోడ్ల పై వరద నీరు నిలిచి పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. ఎదులాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వర్షానికి వరిధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవి ఎండల తీవ్రతకు చెరువులు, కుంటల్లో నీటి నీల్వలు తగ్గిపోగా భారీ వర్షంతో వరదనీరు వచ్చి చేరుతున్నది. ఘట్‌కేసర్ మండలంలో పలు చోట్ల విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు తలెత్తి కరెంట్ సరఫరాకు ఆటంకం కల్గగా విద్యుత్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మత్తులు చేయిస్తున్నారు. ఈదురుగాలులకు కరెంట్ తీగలు, లైన్లలో సమస్యలు రావడంతో తరచుగా కరెంట్ నిలిచిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



# పేకాట రాయుళ్ల అరెస్టు

**కడ్తాల్, మే 07 ప్రభాతవార్త :**
మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బును పందెంగా పెట్టి మూడుముక్కల పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం ఆమన్‌గల్ కోర్టులో హాజరు పరిచినట్లు ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్ తెలిపారు. ఆర్గనైజర్ సంతోష్ వారితో పాటు హైదరాబాద్‌కు చెందిన 18 మంది ఉన్నారు. వీరికి పేకాట ఆడటానికి షెల్టర్ ఇచ్చిన మైసిగండి గ్రామానికి చెందిన వినోద్‌పై కూడా కేసు నమోదు చేశారు. వీరివద్ద ఉన్న మూడు ఫోర్ వీలర్ వాహనాలను ఒక హోండా యాక్టివా, 14 సెల్‌ఫోన్లు, రూ.1,02.600లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బును పందెంగా పెట్టి పేకాట ఆడిన చట్టాన్ని అతిక్రమించి ఎలాంటి అవాంఛనీ సంఘటనలు చేపట్టిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్ తెలిపారు.

